క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత


మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని మంగళగూడ గ్రామానికి చెందిన మంగలి సత్తయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కేశంపేట జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి గురువారం మృతుడి కుటుంబానికి రూ.30వేల 500ల ఆర్థిక సాయం అందజేసి ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆ నగదును గ్రామ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కొట్టం శివవర్ధన్‌రెడ్డి, కొట్టం కృష్ణారెడ్డి, కొట్టం శ్యాంసుందర్‌రెడ్డి, రాంరెడ్డి, చలపతిరెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చుక్క యాదయ్య, ఎడ్ల వెంకటేశ్, మాచర్ల కిష్టయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత


నోట్‌బుక్స్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని మహారాజ్‌పేట్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రేసు సత్తిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రేసు రాజేందర్‌రెడ్డి, హెచ్‌ఎంలు అంజయ్య, శ్వేత, ఉపాధ్యాయులు శంకరయ్య, రాజేందర్‌రెడ్డి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నందిగామ ఏపీఎంగా భగవంతు

నందిగామ: మండలంలోని మహిళా సమాఖ్యలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న యాదగిరి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కేశంపేట మండలంలో ఏపీఎంగా పనిచేస్తున్న భగవంతు నందిగామ మండలానికి బదిలీపై రానున్నారు. కాగా ఇప్పటివరకు ఏపీఎంగా పనిచేసిన యాదగిరిపై జిల్లా అధికారులకు పలు ఫిర్యాదులు అందడంతో ఆయనపై బదిలీ వేటు వేసినట్లు సమాచారం. ఆయనను సెర్ప్‌కు అటాచ్ చేశారు. నూతన ఏపీఎంగా భగవంతు శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

గ్రావిటీ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ అశోక్

నందిగామ: మండల పరిధిలోని చేగూరు పీఏసీఎస్‌లో బుచ్చయ్య అనే వ్యక్తి స్టాఫ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ విధి నిర్వహణలో గతంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో గురువారం బుచ్చయ్యకు మంజూరైన రూ.5 లక్షల 20 వేల గ్రావిటీ చెక్కును పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్ ఆయన సతిమణి భాగ్యమ్మకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మున్నూరు పద్మారావు, సీఈఓ వెంకటయ్య, డైరెక్టర్లు అనిత, సాములయ్య, పీఏసీఎస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న సేవా సంకల్ప్ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలను సాధించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టణ సేవా సంకల్ప్ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. షాద్‌నగర్ సేవా సంకల్ప్ జోన్ చైర్మన్ భయంకార్ రాజు సహకారంతో గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్స్, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుల కోరిక మేరకు వాటర్ ఫిల్టర్ అందజేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ సెక్రటరీ మదన్‌మోహన్‌రెడ్డి, సభ్యులు శివనాగయ్య, రామకృష్ణారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సత్యం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫేస్ రికగ్నైజేషన్.. పరేషాన్!

- బోగస్ పింఛన్లకు చెక్ పెట్టేందుకు అమలు
- వేధిస్తున్న సర్వర్ సమస్య
- పెన్షన్‌దారులకు తప్పని తిప్పలు
- డబ్బులు తీసుకునేందుకు క్యూ


పెన్షన్ల కోసం క్యూలో ఉన్న అర్హులు(ఫైల్)

కొత్తూరు: పెన్షన్ల పంపిణీలో అక్రమాలను నిర్మూలించి.. నిజమైన అర్హులకే ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఇప్పటికే అధికారులు గుర్తించిన లబ్ధిదారులు పెన్షన్ తీసుకునేందుకు ప్రభుత్వం ఫేస్ రికగ్నైజేషన్(ముఖ గుర్తింపు)ను ప్రవేశపెట్టింది. కాగా చాలా ఏళ్లుగా పెన్షన్ తీసుకునే అర్హులు ఈకేవైసీని అప్‌డేట్ చేయని కారణంగా ముఖ గుర్తింపు కష్టంగా మారింది. ఒక్కో లబ్ధిదారుడి ముఖ గుర్తింపు చేయడానికి ఐదు సార్లు ప్రయత్నిస్తుండడంతో పెన్షన్ కోసం వచ్చేవారు క్యూలో చాలా సమయం వేచి ఉండాల్సి వస్తోంది.

మండలంలో..	
పెన్షన్‌దారుల సంఖ్య	2252
వృద్ధులు	898
దివ్యాంగులు	1000
వితంతువులు	264
కల్లుగీత	07
చేనేత	02
ఒంటరి మహిళ	81

మున్సిపాలిటీలో..	
పెన్షన్‌దారుల సంఖ్య	1263
వృద్ధులు	506
వితంతువులు	573
దివ్యాంగులు	131
కల్లుగీత	14
ఒంటరి మహిళ	39

పెన్షన్ల వివరాలు ఇలా..

కొత్తూరు మండలం, మున్సిపాలిటీలో మొత్తం 3,515ల మందికి ప్రభుత్వం పెన్షన్లు పంపిణీ చేస్తోంది. ఇందులో వృద్ధులు, వితంతులు, కల్లుగీత, చేనేత, ఒంటరి మహిళలకు రూ.2,016, దివ్యాంగులకు రూ.4,016 అందిస్తోంది.

ఫేస్ రికగ్నైజేషన్‌లో ఇబ్బందులు

- ప్రస్తుతం పెన్షన్ తీసుకునే అర్హులకు ప్రభుత్వం ఫేస్ రికగ్నైజేషన్ అమలు చేస్తోంది. దీంట్లో భాగంగా తప్పనిసరిగా వారు ఆన్‌లైన్‌లో ముఖగుర్తింపును చేయాలి.
- కొన్ని గ్రామాల్లో ఇంటర్నెట్ చాలా నెమ్మదిగా రావడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
- వృద్ధులు, దివ్యాంగులు, ఇతరులు చాలా ఏళ్ల నుంచి ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోలేదు. దీంతో పెన్షన్ తీసుకునే వారి ముఖగుర్తింపునకు అడ్డంకులు ఎదురవుతున్నాయి.
- కొందరు పెన్షన్ తీసుకునేవారు అనారోగ్య, ఇతర సమస్యల కారణంగా ఇంట్లో నుంచి రాలేని వారికి ప్రత్యామ్నాయం ఇంకా లేదు.
- చాలా ఏళ్ల నుంచి ఈకేవైసీ అప్‌డేట్ చేయని కారణంగా పెన్షన్ తీసుకోవడానికి వెళ్తే ఒక్కొక్కరికి ఐదుసార్లు ప్రయత్నించాల్సి వస్తోంది. దీంతో పెన్షన్ల కోసం వచ్చినవారు చాలాసేపు క్యూలైన్లలో ఉండాల్సిన పరిస్థితి ఉంది.

ముఖగుర్తింపు రాకుంటే కార్యదర్శులు ఇస్తారు



ప్రభుత్వం పెన్షన్లు తీసుకునే వారికి ఫేస్ రికగ్నైజేషన్ తప్పనిసరి అమలు చేస్తుంది. ఆన్‌లైన్‌లో ముఖచిత్రం రాని వారికి ఫింగర్ ప్రింట్‌తో ఇస్తారు. ఇవి కూడా రాని వారికి సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరించి పెన్షన్లు ఇస్తారు.

– అరుంధతి, ఎంపీడీఓ

'నీలి నాలుక'కి నివారణే మార్గం


మొయినాబాద్: అజీజ్‌నగర్‌లో జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్యులు


షాబాద్: రాంసింగ్ తండాలో జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి

మండల పశువైద్యాధికారి అహ్మద్

మొయినాబాద్: వర్షాకాలంలో జీవాలకు సోకే నీలి నాలుక వ్యాధికి ముందస్తు నివారణ ఒక్కటే మార్గమని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్, మండల పరిధిలోని అమ్డాపూర్‌లో గురువారం గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవాలకు నీలి నాలుక వ్యాధి సోకితే మూతికి పుండ్లు, చిగుళ్ల వాపు, పెదవుల లోపలి భాగం ఎర్రబడుతుందన్నారు. కాళ్ల గిట్టల మధ్య పుండ్లు అయ్యి నడవలేని స్థితి ఏర్పడుతోందన్నారు. దీంతో మేత సరిగా మేయక, నీళ్లు సరిగా తాగక నీరసించి చనిపోతాయన్నారు. ఈ వ్యాధికి మందులు లేవని.. ముందస్తుగా నివారణ టీకాలు ఇప్పించి జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్‌లో 1033, అమ్డాపూర్‌లో 376 జీవాలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యురాలు దేవిరెడ్డి, సిబ్బంది ప్రసన్నకుమార్, భీమ్‌రావు, గోరెమియా తదితరులు ఉన్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి

షాబాద్: గొర్రెలు, మేకలకు నీలినాలుక వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు ప్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని రాంసింగ్‌తండా, రేగడిదోస్వాడ, అంతారం, నాంధార్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో మూగజీవాలకు నీలినాలుక వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవాలకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

గిరిజనుల ముందస్తు అరెస్ట్


పోలీసుల అదుపులో గిరిజన నాయకుడు ఆకాశ్‌నాయక్

కొందుర్గు: లంబాడి సామాజిక వర్గానికి రాష్ట్రంలో మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం గాంధీ భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన సందర్భంగా జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు గిరిజన నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా గిరిజన నేత ఆకాశ్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన కులగణనలో లంబాడి జనాభా వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ, సామాజిక, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. న్యాయబద్ధంగా లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తే అరెస్టులు చేయించడం అమానుషమన్నారు.

యూరియా కోసం బారులు


కొందుర్గు ఆగ్రో సెంటర్ వద్ద యూరియా కోసం వచ్చిన రైతులు

కొందుర్గు: ఇటీవల వర్షాలు సంమృద్ధిగా కురవడంతో రైతన్నలు పత్తి, మొక్కజొన్న పంటలకు పైపాటు ఎరువుగా వేయడానికి యూరియా ఎంతగానో అవసరం. మండలంలో 5 వేల ఎకరాల వరకు పత్తి, 6 వేల ఎకరాల వరకు మొక్కజొన్న, 6 వేల ఎకరాల వరకు వరి సాగుచేస్తున్నారు. ఇందుకోసం రైతులకు యూరియా అవసరం అనివార్యమైంది. కాగా ప్రభుత్వం యూరియా సరఫరాలో ససేమిరా అంటూ కొద్దికొద్దిగా ఇవ్వడంతో రైతులు ఆరాటపడుతున్నారు. యూరియా కొరత ఏర్పడుతుందేమోనన్న భయంతో దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. కాగా యూరియా కొరత ఏమిలేదని, రైతులకు గురువారం కొందుర్గు ఆగ్రోసెంటర్ ద్వారా 20 టన్నుల యూరియా పంపిణీ చేశామని ఏఓ సురేశ్‌రెడ్డి తెలిపారు. ఒక్కో రైతుకు రెండు నుంచి అయిదు బస్తాల యూరియా పంపిణీ చేశామన్నారు. శుక్రవారం పీఏసీఎస్‌కు యూరియా వస్తుందని, అవసరమైన రైతులు ఆధార్‌కార్డు తీసుకొని రావాలని సూచించారు.

ఐకేపీ ఏపీఎంకు సన్మానం


రాజేశ్వరిని సన్మానిస్తున్న అధికారులు తదితరులు

కడ్తాల్: ఐకేపీ ఏపీఎంగా పనిచేస్తున్న రాజేశ్వరి నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనంలో ఆమెను మహిళా సంఘాల ప్రతినిధులు, సీసీలు, వీఓఏలు, ఐకేపీ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. రాజేశ్వరి సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు, అతివల ఆర్థికాభివృద్ధి, ప్రగతి కోసం అహర్నిషలు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, కెనరా బ్యాంకు మెనేజర్ విజయ్‌కుమార్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కుమార్తె, వీఓఏలు వనిత, శోభ, మహిళా సంఘాల సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికురాలికి చేయూత


కార్మికురాలు అండాలుకు పట్టా కాగితాలను అందిస్తున్న దాత సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన మున్సిపల్ కార్మికురాలికి ఇంటి స్థలం లేకపోవడంతో ఆమెకు తన పట్టా పొలంలో నుంచి 60 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి అందించి తనలోని మానవత్వాన్ని చాటుకున్నాడు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి. మున్సిపాలిటీ పరిధిలోని దేవునిఎర్రవల్లి వార్డులో పనిచేసే మున్సిపల్ కార్మికురాలు తూర్పాటి అండాలుకు సొంత ఇళ్లు లేకపోవటంతో ఇందిరమ్మ ఇళ్లు కోసం దరఖాస్తు చేసుకుంది. ఆమెకు ఇళ్లు మంజూరైనా సొంత స్థలం లేకపోవటంతో ప్రభుత్వం స్థలం కేటాయిస్తే ఇల్లు నిర్మించుకోవాలని చూస్తోంది. ఈ విషయం తెలుసుకున్న సత్యనారాయణరెడ్డి మానవత్వంతో ముందుకొచ్చి కార్మికురాలికి తన పట్టా పొలం గ్రామానికి సమీపంలోనే ఉండటంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు కావాల్సిన 60 గజాల స్థలాన్ని ఇస్తానని గ్రామస్తుల ముందు హామీ ఇచ్చాడు. ఈ మేరకు గురువారం చేవెళ్ల తహసీల్దార్ కార్యాలయంలో 60గజాల స్థలాన్ని ఆమె పేరుపై రిజిస్ట్రేషన్ చేసి ఆ డాక్యుమెంట్లను మున్సిపల్ కమిషనర్ వెంకటేశం చేతుల మీదుగా కార్మికురాలికి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పేద కార్మికురాలికి సొంత స్థలాన్ని విరాళంగా అందించటం అభినందనీయమని కొనియాడారు. కార్మికురాలు అండాలు కుటుంబం సత్యనారాయణరెడ్డి చేసిన సహాయం ఎప్పటికీ మరిచిపోలేదన్నారు. కార్యక్రమంలో దేవునిఎర్రవల్లి మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, మున్సిపల్ అధికారులు, స్థానికులు ఉన్నారు.

సీఎస్‌ను కలిసిన ఫుడ్ కమిషన్ చైర్మన్


సీఎస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఆమనగల్లు: ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు గురువారం నగరంలోని సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫుడ్ కమిషన్ ప్రగతి గురించి వివరించారు. సీఎస్‌ను కలిసి వారిలో గోలితో పాటు సభ్యులు ఆనంద్, గోవర్ధన్, జ్యోతి ఉన్నారు.

సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత

ఆమనగల్లు: సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆమనగల్లు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధి జంగారెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను గురువారం ఆయన.. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలో 3500 ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అర్హులు ఎవరూ ఆందోళన చెందవద్దని, విడతల వారీగా అందరికీ ప్రభుత్వం ఇళ్లు కట్టిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖాదర్‌ఖాద్రి, కృష్ణ, శ్రీనునాయక్, చంద్రయ్య, జానీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని 27వ వార్డులో గల తిరుమల కాలనీలో టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా రూ.3.36కోట్లతో సీసీరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, వెంకటేశ్వరకాలనీ పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపల్ పరిధిలో చేపట్టనున్న సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కాలనీలో ఉన్న విశ్రాంత తహసీల్దార్ సరాపు జగదీశ్వర్ దంపతులను ఆయన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరు విశ్వం, మాజీ కౌన్సిలర్ విజయశ్రీమురళీమోహన్(అప్పి), నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి


నూతన అధ్యక్షుడు మల్లేశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి

షాబాద్: పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, లింగారెడ్డిగూడ గ్రామాల్లో బూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా అప్పారెడ్డిగూడ అధ్యక్షుడిగా మల్లేశ్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్, యాదయ్యను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. బీజేపీతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ దేశవ్యాప్తంగా బలమైన శక్తిగా మారిందన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి కార్యకర్తలకు సలహాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రతీ కార్యకర్త శ్రమిస్తే విజయాన్ని అందుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల సెక్రటరీ మమతా సురేశ్‌గౌడ్, శేఖర్, శ్రీనివాస్, శ్రీశైలం, సాయిరాంగౌడ్, మహేశ్, లింగం, శ్రీకాంత్, శశికుమార్, రవి, శ్రీకాంత్, యాదయ్య, రామకాంత్, వీరేశ్, వరుణ్, నరేశ్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నందిగామ మండలంలోని చేగూరు గ్రామానికి చెందిన అజ్మత్ 2019లో విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. అప్పటి నుంచి అజ్మత్ కుటుంబం పరిహారం కోసం ఎదురుచూశారు. ఆరేళ్ల తర్వాత విద్యుత్ అధికారులు మంజూరు చేసిన రూ.5లక్షల చెక్కును గురువారం పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్ల పాలనలో పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు, విద్యుత్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు జంగ నర్సింలు, హరినాథ్‌రెడ్డి, చెన్నయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి శ్రావణ్‌మాదిగ


పెన్షన్‌దారులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నందిగామ: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇచ్చే పెన్షన్‌ను పెంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల ఇన్‌చార్జి శ్రావణ్ మాదిగ కోరారు. మండల కేంద్రమైన నందిగామలో గురువారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగారి రమేశ్ మాదిగ ఆధ్వర్యంలో పెన్షన్‌దారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలను ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచడానికి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు ప్రజలు, నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెన్షన్‌దారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ సహజం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రతీ ఉద్యోగికి విరమణ సహజమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ వి.రవీందర్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఎంపీడీఓ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈఓ రంగారావు పాల్గొని రవీందర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ఎంపీడీఓలు, చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలకు చెందిన ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రవీందర్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు, అధికారులు